ఉష్ణోగ్రత : గరిష్ఠం 40.5 కనిష్ఠం 19.5

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 4:51 (శనివారం ఉదయం)



మాట్లాడుతున్న చైర్మన్ హన్మంతరెడ్డి

మంచాల సొసైటీ సీఈవో సస్పెన్షన్

మంచాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) శ్రీనివాస్‌ను విధుల ఉంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్యాక్స్ చైర్మన్ వెదిరె హన్మంతరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సహకార సంఘ పరిధిలో జరిగిన అక్రమాలకు సంబంధించి కోర్టు తీర్పు నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు సీఈవోను బాధ్యతల నుంచి తప్పించినట్లు వెల్లడించారు. తాత్కాలిక ఇన్‌చార్జి సెక్రటరీగా రమేశ్, క్యాషియర్‌గా సంతోష్, కంప్యూటర్ ఆపరేటర్‌గా లింగం, సేల్స్‌మన్‌గా శ్రీకాంత్‌ను నియమిస్తూ తీర్మానించి అధికారులకు పంపామని తెలిపారు.



పని చేసినా.. పస్తులే!

'ఉపాధి' కూలీలకు అందని కూలి డబ్బులు

ఇల్లు గడవడం లేదని ఆవేదన

8

సన్నబియ్యం పంపిణీ ఇలా..

రేషన్ షాపులు	ఆహార భద్రత కార్డులు
936	5,81,410

అవసరమైన బియ్యం(టన్నుల్లో..)	ఇప్పటికే లిఫ్ట్ చేసింది
14,500	1,500



ఉగాదికి సన్నబియ్యం!

తెలుగు వత్సరాదిన పథకం ప్రారంభం

రేషన్ కార్డులున్న పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అధికారంలోకొస్తే దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఆ మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఉగాది పండుగ నాడు సన్నబియ్యం పంపిణీ పథకం శ్రీకారానికి నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 5.81లక్షల మంది కార్డుదారులకు కార్డులో పేరు ఉన్న ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తారు. రేషన్ షాపులకు సన్నబియ్యం చేరుకుంటున్నాయి.

» వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులకు పంపిణీ

» ఏర్పాట్లు చేస్తున్న పౌర సరఫరాల శాఖ

» ఇప్పటికే షాపులకు చేరుతున్న బియ్యం

రంగారెడ్డి అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేయనుంది. ఇందుకు సంబంధించి జిల్లా పౌరసరఫరా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారంలోకొస్తే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇప్పుడు సన్నబియ్యం పంపిణీకి సిద్ధమైంది. గతంలోనే వీటి సరఫరాకు ఏర్పాట్లు చేసింది. కానీ సన్న బియ్యం కొరత కారణంగా పథకాన్ని వాయిదా వేసి ఉగాది నుంచి అందజేస్తామని ప్రకటించింది. మార్చి 30న ఉగాది పండుగ నాడు ఈ పథకాన్ని లాంఛనంగా

మిగతా 8వ పేజీలో...

5,81,410 రేషన్ కార్డులు



జిల్లాలో 5,81,410 రేషన్ కార్డులు ఉండగా, 14,500 టన్నుల సన్న బియ్యం అవసరం కానుంది. గోదాముల్లో నిల్వ ఉన్న 1,500 టన్నుల సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించారు. మిగతా 13వేల టన్నుల బియ్యాన్ని మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి తెప్పించేలా పౌరసరఫరాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వరకు రేషన్ షాపుల్లో బియ్యాన్ని పంపిణీ చేస్తారు. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈసారి మార్చి 30న ఉగాది పండగ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. మార్చి 29వ తేదీ వరకు అన్ని రేషన్ షాపులకు సన్న బియ్యాన్ని చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

» సర్కారు స్థలాల్లో వెలిసిన హోర్డింగ్‌లన్నీ తొలగిస్తాం

» హైడ్రా కమిషనర్ రంగనాథ్



తొండుపల్లిలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

శంషాబాద్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి చెరువులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మండలంలోని చాలా ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేశారని ఫిర్యాదులందాయన్నారు. వాటి పరిశీలనకే వచ్చామని చెప్పారు. తొండుపల్లి సర్వే నంబర్ 108లో పదుల సంఖ్యలో ప్రభుత్వ భూమి ఉందని, దానిని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేయాలని తహసీల్దార్ రవీందర్ దత్‌కు సూచించారు. సర్వే నంబర్ 109లో మరో పదెకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమి రికార్డులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఇవే భూముల్లో భారీగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారని, వాటిని తొలగిస్తామని కమిషనర్ చెప్పారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఇంజన్‌లో మంటలు.. కారు దగ్ధం

» తప్పిన ముప్పు



చేవెళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంజన్‌లో మంటలొచ్చి కారు దగ్ధమైన సంఘటన చేవెళ్ల మండలం కందవాడ గేట్ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేసారానికి చెందిన కవ్వగుడెం రాజశేఖర్‌రెడ్డి తన స్కోడా కారు(టీఎస్07 జేజే 3335)లో ఇంటి నుంచి మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. కందవాడ గేట్ సమీపంలోకి రాగానే కారు డ్యాష్ బోర్డులో మంటలులేచాయి. రాజశేఖర్‌రెడ్డి కారును రోడ్డు పక్క ఆపి కారు దిగి ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేశాడు. ఫైర్ ఇంజన్ వచ్చే లోగానే కారు దగ్ధమైంది. ఘటన వద్ద వాహనదారులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఇంజన్ వైరింగ్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు లేశాయని పోలీసులు గుర్తించారు. రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చాన్స్ దక్కేనా?

మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు అవకాశాలు తక్కువే

» రేసులో మల్‌రెడ్డి, టీఆర్‌ఆర్, మహేందర్‌రెడ్డి..

» చీఫ్ విప్ ఇస్తామని ఒకరికి హామీ!



రంగారెడ్డి, ఎమ్మెల్యే



రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే



మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 16 నెలలైనా ఇప్పటి వరకు పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయని విషయం తెలిసిందే. మంత్రివర్గంలో మరో ఆరు బెర్త్‌లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రివర్గంలో చోటు దక్కగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం మూడు జిల్లాల్లో ఒక్కరికీ మంత్రి పదవి దక్కలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ చేపట్టనుండడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. క్యాబినెట్ విస్తరణలో తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠాన పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవి రేస్‌లో ఉన్నా.. ఉమ్మడి జిల్లాకు ఆ పదవి దక్కే అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో నలుగురికి మాత్రమే అవకాశాలు కల్పించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఇప్పుడు ఆరు మంత్రి పదవులను

మిగతా 7వ పేజీలో...

కంకర రోడ్డుతో యాతన

» ఏడాదిగా ప్రజల ఇబ్బందులు



కొత్తపల్లి నుంచి తండా వరకు ఉన్న కంకర రోడ్డు

యాచారం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి నుంచి కొత్తపల్లి తండా వరకు నాలుగు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేస్తామని అధికారులు కంకరతో చేతులు దులుపుకున్నారు. ఈ రోడ్డుకు రూ.2కోట్ల నిధులు కేటాయించారు. చేసిన పనికి బిల్లులు రాక పనులు పూర్తికాలేదని తండా వాసులు చెబుతున్నారు. మట్టి రోడ్డయినా బాగుండేదని, పూర్తిగా కంకర వేయడంతో కంకర రాళ్లపై నుంచి నడిచి, వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. కంకర రోడ్డుపై వాహనాల టైర్లు పాడవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. రోడ్డు పనులు పూర్తి చేయకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు వేసేందుకు ఏడాదవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

వన్యప్రాణులకు.. తీరుతున్న దాహం



గున్‌గల్ అడవిలో నిర్మించిన సాసర్ పిట్

» తొట్లు, సాసర్ పిట్లలో నీటిని నింపుతున్న ఫారెస్ట్ అధికారులు

యాచారం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎండకాలంలో వన్యప్రాణులకు నీటిని అందుబాటులో ఉంచేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గున్గల్ రక్షిత అటవీ ప్రాంతం తాడిపర్తి, కుర్మిద్ద, మంతన్‌గౌరెల్లి అడవుల్లో అధికారులు నీటి తొట్లు, సాసర్ పిట్లలో రెండు రోజులకోసారి నీరు నింపుతున్నారు. గున్గల్, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాలు మొదలుకొని మంతన్‌గౌరెల్లి వరకు నల్లగొండ జిల్లా శివారు వరకు 10వేల ఎకరాల్లో అడవి ఉంది. జింకలు, నెమళ్లు, అడవి పందులు, అడవి పిల్లులు, కుందేళ్లు, నక్కలు, 40 వరకు ఉన్న హైనాలకు నీరందేలా అడవిలో 30వరకు నీటి తొట్లను కట్టించారు. ధ్వంసమైన తొట్లకు మరమ్మతులు చేయించి నీరు నింపుతున్నారు. నిధుల విడుదలకు జాప్యంకావడంతో రేంజర్లు, సెక్షన్ అధికారులు సొంత డబ్బు వెచ్చించి నీరు నింపుతున్నారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.5వేలు వెచ్చించారు. రూ.పదివేలతో నీటి కుంట నిర్మించారు. ఒక్కో సాసర్ పిట్‌ను రూ.5వేలతో నిర్మించారు. యాచారం, గడ్డమల్లయ్యగూడ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతానికి సమీపంలో వరి చేలున్నాయి. నీటి



ఓ కుంటలో నీరు నింపిన అధికారులు

జింకలు, అడవి పందులు వచ్చి దప్పిక తీర్చుకుంటూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు చెప్పారు.

ఎండిన నీటి వనరులు

యాచారం మండలం తాడిపర్తి, కుర్మిద్ద, కందుకూరు మండలం సాయిరెడ్డిగూడ గ్రామాల పరిధిలో 20వేల హెక్టార్లలో అడవి ఉంది. తాడిపర్తి, కుర్మిద్ద అడవుల్లో చిన్న తాటికుంట, బుచ్చిరెడ్డికుంట, పెద్ద తాటికుంట, గండికుంట, సింగాయికుంట తదితర కుంటలు, రెండు పెద్ద చెరువుల్లో నీరు లేదు. దీంతో వన్యప్రాణులు పొలాల్లో నీరు తాగుతున్నాయి. చిన్న గుంతలు, సాసర్ పిట్లు, తొట్టిలను రెండురోజులకోసారి అధికారులు నింపుతున్నారు. ఈ అడవిలో నాలుగేళ్ల క్రితం 300 జింకలను వదలగా వాటి సంఖ్య నేడు 950 దాకా పెరిగినట్లు అధికారులు గుర్తించారు. తాడిపర్తి పరిధిలో ఉన్న తాటికుంట మైసమ్మ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గడంతో వన్యప్రాణులు ఆలయ సమీపంలోని తాటికుంట నీటితో దప్పిక తీర్చుకుంటున్నాయి.

పంటలను నాశనం చేస్తున్నాయి



అడవికి సమీప వరి చేలల్లో జింకలు, అడవి పందులు నీరుతాగి పంటను నాశనం చేస్తున్నాయి. పాలకూర, కొత్తిమీర, టమాట తోటలను తినేస్తున్నాయి. చెక్‌డ్యాంలో నీరు లేక వన్యప్రాణులు పొలాల వద్దకొస్తున్నాయి. వాటి నుంచి మా పంటలను కాపాడాలి.

- సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

మాయమాటలకు ... మోసపోవద్దు

రంగారెడ్డి అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఆర్డీవో పీడీ శ్రీలత అన్నారు. మానవ అక్రమ రవాణాపై గురువారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న వారికి ఉద్యోగం ఇస్తానని నమ్మించి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారని, ఆలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. లైంగిక అవసరాలకు, వెట్టి చాకిరీ చేయించుకుంటారన్నారు. ఎవరైనా అక్రమ రవాణాకు గురవుతుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1930, 100, 104, 1098, 181లకు ఫోన్‌చేయాలన్నారు. అదనపు పీడీ సూర్యారావు, డీపీఎంఎస్‌లు స్వర్ణలత, యాదయ్య, విలాస్‌రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కవిత, ఏపీఎంలు యాదగిరి, విజయ మాలిని పాల్గొన్నారు.

హోటళ్లలో అపరిశుభ్రతుంటే చర్యలు

» అధికారుల తనిఖీలు

» యజమానులకు జరిమానా



ఓ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న రెండు హోటళ్లకు జరిమానా విధించారు. మున్సిపాలిటీ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్టార్ బావర్చి, రెడ్ బకెట్, స్వాతి బేకరీల్లో ఆహార పదార్థాలను, కిచెన్లలో తనిఖీ నిర్వహించారు. స్టార్ బావర్చి, రెడ్ బకెట్ రెస్టారెంట్లలో ఆహార పదార్థాలు, కిచెన్‌లో ఉన్న పదార్థాలు అపరిశుభ్రంగా ఉండడంతో రూ.5వేల చొప్పున జరిమానా విధించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇప్పటికైనా పరిశుభ్రత పాటించడంతో పాటు స్వచ్ఛమైన పదార్థాలతో ఆహారాన్ని తయారు చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



గంగారంలో తీర్మాన ప్రతులను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

ఫ్యూచర్ సిటీ విలీనోద్యమం ఆగదు

మహేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేంత వరకు తాము ప్రారంభించిన ఉద్యమం ఆగదని, అందుకు మండల ప్రజలు మద్దతివ్వాలని గురువారం గంగారంలో జేఏసీ నాయకులు తీర్మానించారు. ఈ మేరకు ప్రతులను విడుదల చేశారు. ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వి.రఘుపతి మాట్లాడుతూ.. మహేశ్వరం మండలం నూతన మహానగరంగా రూపుదిద్దుకుంటుందని ప్రభుత్వం ప్రకటించి ఇప్పుడు ఈ మండలాన్ని కాదని హైదరాబాద్‌కు దూరంగా ఉన్న మండలాలతో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు యత్నిస్తోందన్నారు. మహేశ్వరం పూర్తి మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకుల ఏకతాటిపైకి రావాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజాభిప్రాయ, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు కర్నాటి మనోహర్, మల్లేష్‌యాదవ్, కె.జంగయ్యయాదవ్ యాదీష్, దేశ్యా, సూర్యనాయక్, కె.చంద్రయ్య, రాజు, బి.నర్సింహ, నర్సింహగౌడ్, పెంటయ్య, యాదయ్యగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, దత్తూ, సుదర్శన్, సుభాష్, శ్రావణ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. హార్టికల్చర్ ద్వారా 75శాతం సబ్సిడీతో మంజూరైన స్ప్రింకర్లను ఆయన గురువారం రైతులకు అందించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై పనిముట్లను ఇవ్వకుండా గత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, దేశ్యానాయక్, హార్టికల్చర్ అధికారి సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీ పరికరాలను అందిస్తున్న రాజేశ్‌రెడ్డి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

దుద్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుముల్‌మైలారం గ్రామంలో సోమవారం అకాలంగా కురిసిన వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో హిమబిందు గురువారం పరిశీలించారు. కోతకు వచ్చే సమయంలో వరి పొలాల్లో 40-50 శాతం వరకు వడ్లు రాలినట్లు గుర్తించారు. అదేవిధంగా పొట్ట దశకు వచ్చిన తరుణంలో వరి పంటకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు అధికారులతో వాపోయారు. 20మంది రైతులకు చెందిన 100 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఎస్‌ఎంఎస్‌ఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ దివ్యానగర్ నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న టెక్‌ఫెస్ట్-2025ను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడు కొత్తగా సృజనాత్మకంగా ఆలోచిస్తూ ప్రతిభను విస్తరించాలన్నారు. ఉద్యోగాల కోసమే కాకుండా పరిశ్రమల స్థాపనకు యువత కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ, నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్లా మల్లారెడ్డి, డైరెక్టర్ దివ్యా నల్ల, కోశాధికారి స్నేహ నల్ల, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీఎన్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అవిష్కరిస్తున్న నల్లమల్లారెడ్డి, తదితరులు

ఘనంగా ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్

ఇబ్రహీంపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులచే ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హర్యానా సంస్కృతి, భాష, వేషధారణ, ఆహారం, నృత్యాలు, ముఖ్య ప్రదేశాలపై టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, నృత్య, ఉపన్యాస, వేషధారణ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో హర్యానా వంటకాలైన రోటీ, దాల్ వడ్డించారు. హెచ్‌ఎం వి.కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

చేవెళ్ల/కందుకూరు/కడ్తాల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని ఎమ్మెల్యే కాలెయాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో అట్లాస్ గార్డెన్‌లో ముస్లింలకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పాల్గొని వారితో కలిసి విందులో పాల్గొన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ రాజేంద్రకుమార్, నాయకులు ఎం.యాదగిరి, బాసిత్, హజీ, మైనారిటీ నాయకులు ఉన్నారు. అలాగే మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కౌశిక్‌రెడ్డి అన్నారు. కందుకూరు మండలం లేమూరులో మైనారిటీ నాయకుడు నసీర్‌అహ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మైనారిటీ నాయకులు ఎండీ దావూద్, మీనాక్ష పటేల్, సయ్యద్ ఇమ్రాన్, ప్రభాకర్, రియాజ్, ఇలియాస్,తదితరులున్నారు. మండల కేంద్రంలో ఎండీ చోటు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కడ్తాల్ మండలకేంద్రంలోని మజీద్ ఖుబాలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. షబ్ ఏ ఖదర్‌ను పురస్కరించుకొని మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రఫూఫ్, ఉపాధ్యక్షుడు జావిద్, నాయకులు జహంగీర్ అలీ, లాయక్‌అలీ, జహంగీర్‌బాబా, ఇర్షాద్, ఆమిర్, షకీల్, ఇద్రీస్, ఫరూఖ్ పాల్గొన్నారు.



కందుకూరు: ఇఫ్తార్‌లో కౌశిక్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యాదయ్య

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీజ్యోతిభీంభరత్

షాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని సత్తా చాటాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్ అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గం ఏ-బ్లాక్ వైస్ ప్రెసిడెంట్‌గా షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు చెందిన పల్లాటి అశ్వినిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆమె నియామకపత్రాన్ని అందజేశారు. చేవెళ్ల నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ్యశ్రీరెడ్డి, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాధ్యక్షురాళ్లు కావ్య, పుష్పమ్మ, స్వరూప తదితరులు ఉన్నారు.

మైసిగండి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో సిరోలిపంతూ, ఈవో స్నేహలత

కడ్తాల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌ల సమక్షంలో హుండీలను లెక్కించారు. 60 రోజులకు గాను రూ. 12,01,567 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఆర్‌పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, చంద్రయ్య, కృష్ణ, పోలీసు, ఆలయ సిబ్బంది, వీజీఎల్ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సైదాన్‌కు డాక్టరేట్

ఇబ్రహీంపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు డి.సైదాన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆన్ ఎఫీషియంట్ బ్రెయిన్ ట్యూమర్ క్లాసిఫికేషన్ ఫ్రమ్ ఎమ్మారై ఇమేజెస్ యూసింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ప్రేమ్‌చంద్, సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ పీవీ సుధ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక పరిశీలన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి అందజేశారు. ఈమేరకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. గురువారం కళాశాలలో సెక్రటరీ డా.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, అధ్యాపక బృందం ఆయన్ను అభినందించారు.



సైదాన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం



ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న గౌరవ్‌గార్గ్

శంషాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు విద్యనభ్యసించడానికి ఇబ్బందులు పడకుండా అవసరమైన చేయూతనందించడమే లక్ష్యంగా రౌండ్‌టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆసంస్థ డైరెక్టర్ గౌరవ్ గార్గ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కోత్వాల్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదుల ప్రాంగణాన్నిఆయన గురువారం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు నాగలక్ష్మి, చైతన్యచిన్నం, మక్సూద్‌హైమద్, హర్షిత్‌సేథ్, లోకేశ్వర్‌రెడ్డి అఖిల్ కోత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ శ్రీనుగౌడ్, శేఖర్‌గుప్తా, బాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి

శంకర్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలని చేవెళ్ల నియోజకవర్గ ప్లాస్టర్ల అధ్యక్షుడు అబ్రహం డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఎన్నో అనుమానాలున్నాయని ప్రకటనలో తెలిపారు. పోలీసులు వెంటనే విచారణ జరిపించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి

కోట్‌పల్లి, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి కలుగుతుందని ఎస్‌బీఐ డైరెక్టర్ రమేష్ అన్నారు.బార్వాద్ రైతువేదికలో గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌బీఐ చిలుకూరివారి సౌజన్యంతో కుట్టుమిషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధిహామీలో 100 రోజులుపూర్తి చేసుకున్న మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శివయ్య, అరుణ, మల్లేశం, నర్సింహులు, శశికళ, నిర్మల, గణేష్, నాగిరెడ్డి, మల్లేశం, గోపాల్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బ్యాంకు సిబ్బంది

విషపదార్థం తిని గేదె మృత్యువాత!

యాచారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్లు అడవి పందుల కోసం పెట్టిన విష పదార్థం తిని రూ.లక్ష విలువ చేసే పాడిగేదె మృత్యువాత పడింది. ఈ ఘటన యాచారం మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి రూ.లక్ష విలువ చేసే గేదెను కొనుగోలు చేశాడు. దానితో పాటు మరో గేదెను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో పొలంలో మేత మేయడానికి వదిలి పెట్టాడు. అయితే, అడవిపందుల కోసం పెట్టిన విషం తినడంతో గేదె దంతాలు పగిలిపోయాయి. దాంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. మరో 20రోజుల్లో ఆ గేదె ఈననుందని బాధిత రైతు తెలిపాడు. సంఘటనా స్థలానికి పశుసంవర్ధకశాఖ అధికారులు వెళ్లి విచారణ చేపట్టారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించేందుకు షెడ్యూల్ 8లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని కోరుతూ గురువారం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని చాలా కాలంగా గిరిజనులు ఉద్యమాలు చేస్తున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. చివరకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని కోరుతూ తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపించి గిరిజనులపట్ల తమ అభిమానాన్ని చాటుకున్నదని ఆయన చెప్పారు.

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో రామ్మోహన్‌రెడ్డి భేటీ



పరిగి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేతో గురువారం పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణలో తమకు స్థానం కల్పించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో అమలవుతున్న పథకాలపై వివరించారు. పథకాలపై పట్ల ప్రజల్లో స్పందన ఎలా ఉందని ఖర్గే రామ్మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



సయ్యద్‌పల్లిలో పూజలు చేస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వీరాంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

పరిగి,మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ వీరాంజనేయస్వామి వార్షికోత్సవాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, పార్టీ నాయకులు పి.వెంకటయ్య, రవీంద్రారెడ్డి, వెంకటరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

90శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించాలి

శామీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పేరుకపోయిన ఆస్తిపన్నులను 90శాతం రాయితీతో చెల్లించడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో గురువారం కమిషనర్ వెంకటగోపాల్ పర్యటిస్తూ పేరుకపోయిన ఆస్తి పన్నుల వసూళ్లకు మున్సిపల్ బిల్‌కలెక్టర్లతో ప్రత్యేక క్యాంపేయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంటలోని పలు ఇళ్లలోకి కమిషనర్ వెళ్లి ఆస్తి పన్నుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇచ్చిన 90 శాతం రాయితీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పేరుకపోయిన ఇంటి పన్నులను వెంటనే చెల్లించి 90శాతం రాయితీని లబ్ధిపొంది మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని కమిషనర్ పిలుపు నిచ్చారు.



క్యాన్సర్ అవగాహన సదస్సుల్లో పాల్గొన్న విద్యార్థులు

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మేడ్చల్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నబత్ లఖాని అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆటిజం క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ నబత్ లఖాని మాట్లాడుతూ.. ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ లఖాని, కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్‌వో రవి, సుధాకర్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మోమిన్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మోమిన్‌పేట్ మండలంలోని బురుగుపల్లి పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వికారాబాద్ జిల్లా విద్యాశాఖ మానిటర్ రాము గురువారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి మెమోంటోలు, ప్రశాంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు వీరేశం, తెలంగాణ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, జిల్లా సీనియర్ మెంటర్లు నాగరాజు, రాజు, చిరంజీవి, సత్యానందం, రమేశ్, యాదయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చాన్స్ దక్కేనా?

(ఐదో పేజీ తరువాయి)

భర్తీచేస్తే ఉమ్మడి జిల్లాకు అవకాశం దక్కొచ్చని ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన ఐదుగురు ఎమ్మెల్యేలు గ్రామీణ ప్రాంతాల నుంచే గెలుపొందారు. వీరిలో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండగా వికారాబాద్ నుంచి గెల్చిన ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఈ రెండూ కీలక పదవులే కావడంతో ఉమ్మడి జిల్లా నుంచి కొత్తగా మరొకరికి మంత్రివర్గంలో ప్రాధాన్యం దక్కే అవకాశాలు కన్పించడం లేదు. ఇదిలా ఉంటే పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. కొందరు కాంగ్రెస్ పెద్దలతో తనకున్న పరిచయాలతో టి.రామ్మోహన్‌రెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా తానే అందరికంటే సీనియర్ అని, తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆయన ఇటీవల పార్టీ పెద్దలన కలిసేందుకు ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపులపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతుండడం మహేందర్‌రెడ్డికి ప్రతిబంధంగా మారింది. ఆయనకు ఇప్పటికే మండలిలో చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో ఆయన కొంత సంతృప్తికరంగానే ఉన్నారు. ఇదిలా ఉంటే జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ముగ్గురు కూడా పదవిని సంపాదించేందుకు వారి సామాజికవర్గం మైనస్‌గా మారింది. ఇదే సామాజికవర్గానికి చెందిన ఇతర జిల్లాల ఎమ్మెల్యేలకు ఇప్పటికే అధిష్ఠానం నుంచి హామీ రావడంతో ఇక్కడ అవకాశాలు లేవని ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇక ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఇంతకు ముందు మంత్రివర్గంలో చాన్స్ కోసం యత్నించినా ప్రస్తుతం మౌనంగానే ఉన్నారు. ఇదిలా ఉంటే మంత్రివర్గంలో చాన్స్ కోసం ప్రయత్నిస్తున్న ఇద్దరిలో ఒకరికి చీఫ్‌విప్ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంపీడీవో కార్యాలయంలో పాము కలకలం



తాండూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో నాగు పాము కలకలం రేపింది. గురువారం ఉదయం ఎంపీడీవో కార్యాలయం గదిలో అటెండర్ శుభ్రం చేసేందుకు వెళ్లాడు. గదిలో ఒక మూలన నాగు పాము కనిపించింది. అటెండర్ వెంటనే భయంతో బయటికి వచ్చి సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వెంటనే సిబ్బందికి వచ్చి పామును కర్రతో కొట్టి చంపారు. పామును చంపేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఇక్కడ ఉన్న ఏపీవో, ఎంఈవో, ఐకేపీ, డీఎల్‌పీవో తదితర కార్యాలయాల వెనుక భాగంలో ముళ్లపొదలు ఉండటంతో పాములు తిరుగుతున్నాయని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఎక్కడి నుంచి ఏపాము కార్యాలయం గదుల్లో చేరుతున్నాయో తెలియడం లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

స్లాబ్‌కే మోడల్ మార్కెట్ పరిమితం



స్లాబ్‌లకే పరిమితమైన మోడల్ మార్కెట్ భవనం

నిధులకు గ్రహణం

- ఏడాదిన్నరగా నిలిచిన నిర్మాణాలు
- రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో చేపట్టిన సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ నిర్మాణానికి నిధులు రాక పనులు నిలిచాయి. ఏడాదిన్నరగా పనులు పునఃప్రారంభం కాలేదు. కూరగాయలు, మటన్, చికెన్, చేపలు, పూలు రోడ్లపక్కనే అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గతంలో షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ యార్డును చౌడమ్మగుట్ట వద్ద నిర్మించిన నూతన మార్కెట్ యార్డుకు తరలించారు. మార్కెట్‌కు యార్డులోని రెండెకరాల స్థలాన్ని మోడల్ మార్కెట్‌కు కేటాయించారు. నిర్మాణానికి రూ.4.5కోట్లను గత ప్రభుత్వం మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. మాంసం, చికెన్, చేపలు, పూల విక్రయాలు ఒకే సముదాయంలో నిర్వహించుకునేలా ప్రణాళిక రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు వైపులా దుకాణాలను నిర్మించి, వాటికి అనుసంధానంగా రేకులతో పైకప్పు వేసేలా పనులు చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మించాలని ఒక సముదాయానికి రెండు స్లాబ్‌లు వేశారు. రెండో సముదాయానికి ఫుటింగ్‌లు, బేస్మెంట్ పిల్లర్లను వేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక, ఆ లోపే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. సవరించిన అంచనాల మేరకు రూ.11కోట్లు కేటాయిస్తూ గత ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇందుకు పరిపాలన అనుమతులు వచ్చేలోగానే ప్రభుత్వం మారడం, నిధులు రాక కాంట్రాక్టర్ పనులాపేశాడు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషిచేస్తేనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యే పరిస్థితులున్నాయి.



పునాదులకు పరిమితమైన షెడ్లు

నిధులు రాకే నిర్మాణం ఆగింది



నిధులు విడుదలకాకే సమీకృత మార్కెట్ భవన నిర్మాణం నిలిచింది. మొదట మంజూరైన 4.5కోట్లతో చేపట్టిన పనులు మరిన్ని నిధులు అవసరం కాగా ప్రతిపాదనలు పంపాం. ఈ మేరకు జీవో విడుదలైంది. పరిపాలన అనుమతులు రావాలి. చేసిన పనులకు బిల్లులొచ్చి, అదనపు నిధులు విడుదలైతే పనులు పునఃప్రారంభమవుతాయి.

సాజిద్, పబ్లిక్ హెల్త్ డీఈ, షాద్‌నగర్ మున్సిపాలిటీ

నిధులిచ్చి పనులు ప్రారంభించాలి



షాద్‌నగర్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే సమీకృత మార్కెట్ పనులను పూర్తిచేసేలా ప్రభుత్వం నిధులివ్వాలి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి మిగిలిన పనులు పూర్తయ్యేలా చూడాలి. షాద్‌నగర్ నడిబొడ్డున రెండెకరాల్లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పూర్తిచేస్తే కూరగాయలు, మాంసం, చికెన్, పూలు, పండ్లు, చేపల విక్రేతలకు, ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి.

- కె.నరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్, షాద్‌నగర్

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాందర్‌పూర్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లేశ్ గురువారం పంచాయతీ కార్యదర్శి రాణి, కాంగ్రెస్ నాయకులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

పూడూరు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో మండల పరిధిలోని కంకల్ గ్రామంలో సీసీరోడ్డు పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్ కంకల్, రామచంద్రయ్య, విఠల్, శంకర్, అశోక్, అనంతయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపుల వేలం

బొంరాస్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్‌చర్ల గ్రామ శివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుకను ఇటీవలే రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం సీజ్ చేసిన 19 ట్రాక్టర్‌ల ఇసుకకు వేలం నిర్వహించగా మైసమ్మ ఆలయం దగ్గర ఉన్న 12 ట్రాక్టర్‌ల ఇసుకను అనవేని శ్రీనివాస్ రూ.7500, కలం గట్టు దగ్గర ఉన్న ఏడు ట్రాక్టర్ల ఇసుకను శిరీష రూ.4500కు దక్కించుకున్నారు.

వికారాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- రోడ్ల నిర్మాణంలో నియోజకవర్గానికి ప్రాధాన్యం
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రోడ్ల నిర్మాణంలో వికారాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత తనదని, సీఎం రేవంత్ రెడ్డిదని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సభాధ్యక్షుడిగా మిమ్మల్ని అందరూ అజాత శత్రువని అంటారని ప్రసాద్‌కుమార్‌ను కీర్తించారు. సభలో గురువారం ఆర్‌అండ్‌బీ శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో వికారాబాద్ బైపాస్ రోడ్డు నిర్మాణంపై ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని సీఎం వద్దకు పంపించాలని స్పీకర్ మంత్రి కోమటిరెడ్డికి సూచించారు. మొదటి ఫేజ్‌లోనే వికారాబాద్‌లో అన్ని రోడ్ల పనులు చేపడతామని మంత్రి చెప్పారు. తాండూరు నియోజకవర్గం కూడా వెనుకబడిన ప్రాంతమని, జహీరాబాద్ నుంచి జాతీయ రహదారి ఏర్పాటుపై ప్రతిపాదన ఉందన్నారు. ఈసారి ఢిల్లీ వెళ్లినప్పుడు సీఎంతోపాటు తమరు కూడా రావాలని స్పీకర్‌ను కోరారు. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, చెట్లను ట్రాన్స్‌లోకేట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2021లో మంజూరైన ఈ రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌ను కూడా మొబిలైజ్ చేశామని, ఆ పనులు కొనసాగేలా సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు.



అగ్నివీర్‌లో సైనికులుగా ఎంపికైన విష్ణు, శివ



ఎంపికైన ఇప్పాయిపల్లి గ్రామ యువకులు

అగ్నివీర్‌కు యువకుల ఎంపిక

ధారూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం భారత సైన్యంలో సైనికుల నియమాకం కోసం చేపట్టిన అగ్నివీర్‌లో అన్నదమ్ములైన పల్లెటూరి యువకులు సైనికులుగా ఎంపికయ్యారు. మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన మల్లేశంకు నలుగురు మగ సంతానం. వీరిలో విష్ణు, శివ ఇద్దరు అన్నదమ్ములు. అగ్నివీర్ పరీక్ష రాసేందుకు వీరిద్దరూ సికింద్రాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నారు. అగ్నివీర్ పరీక్షలో విష్ణు, శివలు ఉత్తీర్ణత సాధించి సైనికులుగా ఎంపికయ్యారు. భారత సైన్యంలో సైనికులుగా దేశరక్షణ, సేవచేసే తమ గ్రామానికి చెందిన ఇద్దరికి అవకాశం రావటం గర్వకారణమని కుటుంబసభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కులకచర్ల: ఆర్మీ ఎంపిక ప్రక్రియలో భాగంగా గత 6నెలల క్రితం అగ్నిపథ్ ఎంపిక నిర్వహించారు. అందుకు సంబంధించిన ఫలితాలు గురువారం ప్రకటించారు. కులకచర్ల మండలంలోని ఇప్పయిపల్లి గ్రామానికి చెందిన గణేశ్‌గౌడ్, అభిలాష్ ముదిరాజ్, అఖిల్‌యాదవ్ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టండి



ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డితో మాట్లాడుతున్న అవినాష్ మహంతి

షాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి సారించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. గురువారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఫైల్స్‌ను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ ఉండవద్దన్నారు. పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చూసి మెచ్చుకున్నారు. సమస్యలుంటే నేరుగా తనకు వివరించాలన్నారు. పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరాల అదుపుపై దృష్టి సారించాలన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సై రమేష్, సిబ్బంది ఉన్నారు.

గుట్టల బేగంపేట్ భూములపై 'స్టేటస్‌కో'

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లోని సర్వే నెంబర్ 63లో ఉన్న దాదాపు 78 ఎకరాల భూమి స్వరూపాన్ని మార్చకుండా యథాతథ స్థితి(స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది. ఈ భూమి విషయంలో బుక్యార్‌ఖాన్ ఇతర కుటుంబ సభ్యులకు అనుకూలంగా హైకోర్టు సింగిల్ జడ్జి తీరు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఖాజా కరీముల్లాఖాన్ తదితరులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. తప్పుడు పత్రాల ఆధారంగా సింగిల్ జడ్జి ప్రతివాదులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని.. సుదీర్ఘకాలంగా కబ్జాలో ఉన్నంత మాత్రాన భూమి వారిదైపోదని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి 1962 నుంచి మాత్రమే చరిత్రను పరిశీలించి తీర్పు ఇచ్చారని.. అంతకుముందున్న చరిత్రను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రతివాదులను ప్రభుత్వమే స్వయంగా ఆక్రమణదారులుగా గుర్తించినప్పటికీ సింగిల్ జడ్జి సదరు విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు. ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదిస్తూ.. అప్పీలుదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ అధికారుల సహాయంతో భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని.. ఈ విషయాన్ని సింగిల్ జడ్జి గుర్తించి తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. అన్నివర్గాల వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం వివాదం తేలేవరకు వివాదాస్పద భూమి విషయంలో అన్ని పక్షాలు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

బీజేపీ గెలుపులో నర్సింహారెడ్డి పాత్ర కీలకం



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న చేవెళ్ల బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడిగా జిల్లాకు, పార్టీకి తొమ్మిదేళ్లు సేవలందించిన బొక్క నర్సింహారెడ్డిని చేవెళ్ల మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈమేరకు బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సన్మానించారు. అనంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ప్రతీ కార్యక్రమాన్ని ముందుండి విజయవంతం చేయడంలో నర్సింహారెడ్డి కీలకపాత్ర పోషించాడన్నారు. నాయకులు ఆంజనేయులుగౌడ్, వైభవ్‌రెడ్డి, శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, బాబు, వెంకటేశ్, చేగూరి ప్రవీణ్, బాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జైసింహారెడ్డి, శ్రీతం విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మోదీది అప్రజాస్వామిక పాలన



మాట్లాడుతున్న వినోద్

మహేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన పూర్తిగా అప్రజాస్వామికంగా కొనసాగుతోందని, దీనికి నిరసనగా ఏప్రిల్ 2నుంచి పల్లెపల్లెన జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి, జైబాపు, జెభీమ్, జైసంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి వినోద్ అన్నారు. గురువారం తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం, అంబేడ్కర్‌పై అమిత్‌షా, పలువురు బీజేపీ నేతలు చేస్తున్న దాడి, దేశాన్ని ముక్కలు చేస్తున్న బీజేపీ తీరుపై కాంగ్రెస్ అధినాయకత్వం దేశవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అంబేడ్కర్, గాంధీజిని దేశం మరిచిపోయేలా బీజేపీ అనేక కుట్రలకు తెరలేసిందన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ మేయర్ పారిజాతనర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, ఏనుగు జంగారెడ్డి, ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

దోమ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఎంపీడీవో గ్యామా వన నర్సరీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రతీ గ్రామ పంచాయతీలో 40 వేల మొక్కలే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



శివారెడ్డిపల్లి గ్రామంలో వన నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో గ్యామా

జర్నలిజాన్ని మేల్కొలిపే పాట : స్పీకర్

వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'ఇదేనా జర్నలిజం' అని యువ జర్నలిస్టు మహేష్ రాసిన పాట అద్భుతంగా ఉందని, ప్రతి జర్నలిస్టు వినాల్సిన పాట అని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో గురువారం మహేష్ రచించిన 'ఇదేనా జర్నలిజం' పాటను ఆయన ఆవిష్కరించి వీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. జర్నలిజం విలువలు, జర్నలిస్టుల బాధ్యతలను గుర్తుచేస్తూ సమాజానికి నాల్గో స్తంభంగా ఉన్న మీడియాను మరింత ఆదర్శంగా ఉంచడానికి ఈగీతం తోడ్పడుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి వైద్యానికి దాతల సాయం

తాండూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): యాలాల మండలంలోని సంగెం కుర్దు గ్రామానికి చెందిన భానుప్రియ 10నెలల కుమారుడు చిన్నారి వశిష్ట అరుదైన కాలేయ వ్యాధి, బైలేరియా అట్రేసే వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కాలేయ మార్పిడి చికిత్సకు రూ.25లక్షలు కావాల్సి ఉండగా దాతలను ఆశ్రయించారు. ఇందుకు తాండూరుకు చెందిన వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పెద్దలు, ప్రజలు అందరి దాతృత్వంతో ఇప్పటివరకు సుమారు రూ.16లక్షల వరకు సమకూర్చారు. బాబు ఆపరేషన్ మాదాపూర్ ఫేస్ ఆస్పత్రిలో చేయనున్నారు. బాబు తల్లిదండులకు దాతలను ప్రోత్సహించడంపై ఆర్‌బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి అధ్యాపకులు పర్యాద రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యం మేరకు పన్నుల వసూళ్లు

ఫేస్ టు ఫేస్



'పట్నం' మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్రజలకు వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.రవీంద్రసాగర్ తెలిపారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సిబ్బందితో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. లక్ష్యం మేరకు ట్యాక్సులు వసూలు చేస్తున్నామన్నారు. ఇంకా పలు విషయాలపై 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: పన్నుల వసూళ్లలో ఏ మేరకు టార్గెట్ పెట్టుకున్నారు?

జవాబు: పన్నుల వసూళ్ల రూ.4.96 లక్షలు టార్గెట్ పెట్టుకుని ఇప్పటి రూ.4.69 కోట్లు వసూలు చేశాం. ఈ నెలాఖరు నాటికి లక్ష్యాన్ని చేరుకుంటాం.

ప్రశ్న: మొత్తం మున్సిపల్ జనాభా ఎంత? రోజుకు ఎంత తాగునీరు సరఫరా చేస్తున్నారు?

జవాబు: మున్సిపల్ జనాభా సుమారు 45 వేలు కాగా.. స్టడీ కోసం వస్తున్న విద్యార్థులు, కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు.. ఇతర పౌరులు మరో 40 వేలు ఉంటారు. రోజుకు 50 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. మిషన్ భగీరథ ద్వారా రోజుకు 40-45 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నది ఒక భాగంకాగా.. 105బోర్లు పనిచేస్తున్నాయి. అవసరాలకు సరిపోతున్నాయి.

ప్రశ్న: రోజుకు ఎంత మొత్తంలో చెత్త సేకరణ జరుగుతోంది?

జవాబు: తడి, పొడి చెత్తతోపాటు మెడికల్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరిస్తున్నాం. రోజుకు 10 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. డంపింగ్ యార్డులో బయో మైనింగ్ కూడా చేపడుతున్నాం.

పని చేసినా.. పస్తులే!

- 'ఉపాధి' కూలీలకు సకాలంలో అందని కూలి డబ్బులు
- ఇల్లు గడవడం కష్టంగా మారిందని ఆవేదన

చౌదరిగూడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేసిన కూలీలకు సకాలంలో కూలి డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు డిసెంబరులోనే ముగియడం, రబీ పంటల సాగు నామమాత్రంగా ఉండడంతో కొద్దిమంది కూలీలు మాత్రమే పొలం పనులు చేసుకుంటున్నారు. దాంతో ఎక్కువ మంది ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. అయితే, పనులు చేసినా సకాలంలో కూలి డబ్బులు రాకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. కొందరికి పనులు చేసి నాలుగు వారాలైనా డబ్బులు అందక అష్టకష్టాలు పడుతున్నామని, ఇల్లు గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అప్పులు చేసి కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరికొందరు ఆర్థికలితో అలమటిస్తున్నారు. ఇకపోతే గ్రామాల్లో ఉపాధి పనులు జోరందుకున్నాయి. పనులు చేసేందుకు ప్రతీ కుటుంబంలోంచి ఒక్కరైనా పనులకు వెళ్తున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఉపాధిహామీ కూలీలకు డబ్బులు సకాలంలో జమ కావడం లేదు. కొందుర్గు మండలంలో 6,569 జాబ్ కార్డులకుగాను 805 మందికి రూ.46లక్షల పదివేలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 7,918 జాబ్ కార్డులకుగాను 957 మంది కూలీలకు రూ.24లక్షల 78,802 బిల్లులు రావాల్సి ఉంది.



పెద్దఎల్కిచర్లలో ఉపాధి పనులు(ఫైల్)

కనీస వసతులు కరువు

మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో కూలీలకు పని ప్రదేశంలో ఎండ నుంచి రక్షణకు ఎలాంటి రక్షణ సౌకర్యాలు కల్పించడం లేదు. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండడం లేదు. ఇంటి వద్ద నుంచి వాటర్ బాటిళ్లు, డబ్బాలో తాగునీరు తెచ్చుకుంటున్నారు. తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

బ్యాంకు ఖాతా చెక్ చేసుకోవాలంటున్నారు..



ఆరు వారాలుగా మాకు కూలీ డబ్బులు ఇవ్వలేదు. అధికారులను అడిగితే ఏదో ఒకరోజు డబ్బులు వస్తాయని, బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని చెబుతున్నారు. గ్యాస్ బిల్లు, వంట సరుకులు, రోజువారి ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం. కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉంది.

- నర్సమ్మ, ఉత్తరాస్ పల్లి, కొందుర్గు మండలం

కూలీ డబ్బులు సకాలంలో చెల్లించాలి



మా ఊళ్లోనే నేను, నా భార్య రోజంతా కష్టపడితే కూలి రూ.250 కూడా గిట్టుబాటు కావడం లేదు. రెండు వారాలుగా పనికి వెళ్తున్నాం. డబ్బులు ఖాతాలో జమ కాలేదు. అధికారులను అడిగితే అప్‌లోడ్ చేశాం.. బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెబుతున్నారు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది.

- గుడిసె రాజు, పెద్ద ఎల్కిచర్ల, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

ఆన్‌లైన్ చేయడమే మా బాధ్యత



రోజువారిగా పని చేసిన కూలీల హాజరు, పని పరిమాణాన్ని ఆన్‌లైన్ చేయడం వరకే మా బాధ్యత. కూలీల డబ్బులు ఖాతాలో జమ చేయడమనేది కేంద్రం చేతిలో ఉంటుంది.

- నర్సింగ్‌రావు, ఏపీవో, ఉమ్మడి కొందుర్గు మండలం

నాగిరెడ్డిగూడను మున్సిపాలిటీలో విలీనం చేయాలి



గ్రామస్థులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేయాలని నాగిరెడ్డిగూడ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వారు కలెక్టర్ నారాయణరెడ్డిని గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి మాట్లాడుతూ ఔటర్ రింగురోడ్డుకు సమీపంలో ఉన్న తమ గ్రామాన్ని నూతనంగా ఏర్పాటు చేసిన మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని కోరారు. గ్రామం అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపాలని కోరారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి

మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి గురువారం అసెంబ్లీ వద్ద ఆయన్ను గ్రామస్థులతో కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామానికి వచ్చే రోడ్డు సక్రమంగా లేదని, అండర్‌డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు వారు పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సంజీవరెడ్డి తెలిపారు.

ఉగాదికి సన్నబియ్యం!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి ఏప్రిల్ 1 నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందజేస్తారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 5.81లక్షల మంది కార్డుదారులకు కార్డులోని ఒక్కో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని అందించనున్నారు.

పెరిగిన రేషన్ కార్డులు

జిల్లాలో 936రేషన్ షాపుల్లో మొత్తం 5,58,410రేషన్ కార్డులు ఉండగా, 11,559 టన్నుల దొడ్డు బియ్యం సరఫరా అవుతోంది. కొత్తగా 23వేల రేషన్ కార్డులు మంజూరు చేయడంతో ప్రస్తుతం వాటి సంఖ్య 5,81,410 చేరుకుంది. ఉగాది నుంచి ఈ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే మంజూరైన కొత్త కార్డుదారులు కూడా ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పొందుతారు.

బియ్యం పక్కదారి పట్టకుండా..

ఆహార భద్రత కార్డుదారులకు ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేస్తుంది. ఇవి దొడ్డువి కావడంతో చాలామంది వీటిని తినడానికి ఇష్టపడటం లేదు. అలాంటి వారు తమకు కావాల్సిన కోటా బియ్యాన్ని డీలర్లకే కిలో రూ.13 నుంచి రూ.15లకు చొప్పున అమ్మేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్లు వ్యాపారులకు రూ.20 నుంచి రూ.22 చొప్పున విక్రయిస్తున్నారు. మరికొంత మంది బియ్యాన్ని నెలల తరబడి నిల్వ చేసి తమ ఇంటి వద్దకు ఆటోల్లో వచ్చే వ్యాపారులకు అమ్ముతున్నారు. పేదలకు అందాల్సిన ఈ బియ్యాన్ని దళారులు, వ్యాపారులకు కలిసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని సార్లు దొడ్డు బియ్యాన్ని రీసైకిల్ చేసి సన్నబియ్యం పేరుతో వినియోగదారులకు అంటగడుతున్నారు. పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ లోపంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా సన్న బియ్యం పంపిణీ ద్వారా ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే బయటి మార్కెట్‌లో కొనే సన్న బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేయనుండడంతో వినియోగదారులు వాటిని వాడుకుంటారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

ఉగాది నుంచి రేషన్ షాపుల్లో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 5.81లక్షల కార్డులకు సుమారు 15వేల టన్నుల బియ్యం అవసరం కానున్నాయి. ఇప్పటికే నిలువ ఉన్న 1,500 టన్నుల బియ్యాన్ని లిఫ్ట్ చేశాం. తక్కువ పడే మిగతా బియ్యాన్ని వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

- గోపీకృష్ణ, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ

రైతులకు అండగా సొసైటీ బ్యాంకులు

నందిగామ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా సొసైటీ బ్యాంకులు ఉన్నాయని మేకగూడ పీఏసీఎస్ చైర్‌పర్సన్ మంజులారెడ్డి అన్నారు. మండలంలోని మేకగూడలో మంజులారెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎల్లప్పుడూ రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పటివరకు రూ.9కోట్ల రూపాయల రుణాలు ఇచ్చామని తెలిపారు. సహకార సంఘం యొక్క వార్షిక లావాదేవీలను రైతులకు వివరించారు. లబ్ధిదారులకు రూ.80లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను అందజేశారు. వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవోలు బాల్‌రాజ్, యాదయ్య డైరక్టర్లు యెన్నం భలవంత్‌రెడ్డి, పలుగుట్ట శంకరయ్య, ఎమ్మె జంగయ్య, కొర్ర తౌర్య, యాదయ్య, యాదమ్మ రైతులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న మంజులారెడ్డి

నేడు తైబజార్ వేలం

కడ్తాల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 2025-2026 సంవత్సరానికి గాను కడ్తాల్ గ్రామ పంచాయతీ తైబజార్ వేలం నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీవో లాలయ్య ప్రకటనలో తెలిపారు. రూ. 10వేలు డిపాజిట్ చెల్లించినవారు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం రూ.9,07,750గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు 25శాతం డబ్బు అదేరోజు చెల్లించాల్సి ఉంటుందని, మిగతాది మూడు వాయిదాల్లో చెల్లించాలన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల : నేడు(శుక్రవారం) చేవెళ్ల తైబజార్‌కు వేలం నిర్వహించడం జరుగుతుందని చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని తైబజార్ (అంగడి) వేలం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభవుతుందన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

శంషాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ ఆరోపించారు. గురువారం తొండుపల్లి హైవేపై సీఐటీయూ ఆధ్వర్యంలో హామీలు అమలు చేయాలని రాస్తారోకో నిర్వహించారు. ఇంటి స్థలాలు ఇస్తామని స్థలాలు చూపించకుండా రామోజీ ఫిలింసిటీకి ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రుద్రకుమార్, మండల కన్వీనర్ ప్రణయ్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులున్నారు.

కందుకూరు : నిరుపేదలకు చెందాల్సిన భూములను ఇవ్వాలని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్, జిల్లా నాయకులు ఎ.కుమార్, బి.శ్రీనివాస్‌లు ఆరోపించారు. రామోజీ ఫిలింసిటీ వద్ద రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి యాదయ్యల అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీని నిర్వహించారు.

తలకొండపల్లి : పట్టాలు ఉన్న లబ్దిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో రామోజీ ఫిలింసిటీ వద్దకు వెళ్లిన నాయకుల అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య, దుబ్బ చెన్నయ్య, రాములు, గుమ్మడి కురుమయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ఆర్డీవో చాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మొయినాబాద్ రూరల్ : సీపీఎం నాయకులకు అక్రమంగా అరెస్టు చేయడంపై అజీజ్‌నగర్ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రవీన్‌కుమార్, మహేందర్, రాజేందర్, రవి, సాయి, తదితరులున్నారు.

యాచారం : రామోజీ ఫిలింసిటీ ముట్టడికి సీపీఎం నాయకులు మళ్లీ వెళతారని తెలుసుకున్న హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు 9మంది నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మండల కార్యదర్శి నర్సింహ, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ పెద్దయ్య, ఆలంపల్లి పెంటయ్య, ముచ్చర్ల లాజర్, తదితరులున్నారు.

యాచారం : జాన్‌వెస్లీ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. జగన్, చందూనాయక్, శ్రీశైలం, తదితరులున్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం : రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉన్న పేదల ఇళ్ల స్థలాలను వారికిచ్చి సమస్యను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాచకొండ సీపీ సుధీర్‌బాబును కోరారు. కమిషనర్ కార్యాలయంలో జాన్‌వెస్లీ, నాయకులు సీపీని కలిసి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు, సామేల్, జంగయ్య, బుగ్గరాములు, తదితరులున్నారు.

పొజిషన్ చూపించాలి

కందుకూరు : గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లను ఆధారం చేసుకొని బాధితులకు వెంటనే పొజిషన్ చూపాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 2007లో అప్పటి ప్రభుత్వం కందుకూరు రెవెన్యూలోని 788 సర్వే నెంబర్లలో 183 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం సర్టిఫికెట్లు ఇచ్చారని, కందుకూరు రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 107లో 320మందికి సర్టిఫికెట్లను ఇచ్చారని, నేటికీ ఇంటి స్థలాన్ని చూపలేదని ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయంలో బైటాయించారు. కాగా, వచ్చేనెల 15వరకు నిరుపేదలకు ఇంటి స్థలానికి కబ్జా చూపనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బాల్‌రాజ్, శ్రీనివాస్, చందు, కృష్ణ, కుమార్, సత్తయ్య, తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆజం అలీ

కేశంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మానవాళి పర్యావరణహితంగా నడుచుకోవాలని కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజంఅలీ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం స్టూడెంట్స్ లీడ్ మూవ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎస్‌ఐ రాజ్‌కుమార్ హాజరయ్యారు. ట్రాఫిక్ నియమాలలో భాగంగా విద్యార్థులు వేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి గురైతే ప్రాణాలు పోతాయని, యమధర్మరాజు, చిత్రగుప్తుని వేశాధారణలో నాటక ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వాడకం నిషేదం, వర్షపునీరు ఒడిసి పట్టుకునే ఆలోచన అద్భుతమని తహసీల్దార్ కొనియాడారు. అనంతరం విద్యార్థులు పై విషయాలను ప్రస్తావిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

కందుకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటన సమయంలో వాస్తవ ప్రపంచ వస్తువులు, ప్రదేశాలు, సహజ సంఘటనలు ఇతర సంబంధిత సమాచారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని నేదునూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. గురువారం ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి ఫీల్డ్ ట్రిప్(క్షేత్ర పర్యటన)లో భాగంగా స్థానికంగా ఉన్న ఇటుక తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగం, ఇలాంటి సంస్థలపట్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కుమ్మదిని, పుష్పలత, జ్యోతి, ధనలక్ష్మీ, కరుణాకర్, వెంకటరమణ, పల్లవి, కిరష్మయి, లకుమళ్ల శేఖర్, నాగరమణి, నరేందర్, సంతోష, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

కడ్తాల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే అభివృద్ధి ఆశించిన రీతిలో సాధ్యపడుతుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 2, 3 వార్డుల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణం పనులు నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని సూచించారు. నాయకులు రాంచంద్రయ్య, జంగయ్య, శ్రీకాంత్, దశరథం, జంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాసుదేవ్ పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ శ్రీనుకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.13,500 మంజూరయ్యాయి. గురువారం వాసుదేవ్‌పూర్ గ్రామంలో బాధిత కుటుంబానికి మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్ చెక్కు అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా నిలుస్తుందని లచ్చిరామ్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్ నాయక్, చందర్ నాయక్, దేవ నాయక్, ప్రవీణ్, పవన్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌదరిగూడ : ఇటీవల మరణించిన అనంతరాములు కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి జిల్లేడ్ గ్రామానికి చెందిన అనంతరాములు మరణించడంతో తనతో 2007-2008 టెన్త్ చదివిన మిత్రులు స్వగ్రామానికి వెళ్లివారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అతడి భార్యకు అందజేశారు. ముంతాజ్, లక్ష్మయ్య, రాము, రాజు, మల్లికార్జున్, యాదయ్య, చంద్రయ్య, నవీన్‌పటేల్, సద్దాం, సాయి పాల్గొన్నారు.

కేశంపేట : మండల పరిధిలోని తొమ్మిదిరేకుల మాజీ బీఆర్ఎస్ ఎంపీటీసీ నాగిళ్ల యాదయ్య తల్లి లక్ష్మమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందింది. బీఆర్ఎస్ కార్యకర్తలతో విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మినారాయణ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డిలు గ్రామానికి తరలివెళ్లి ఎంపీటీసీని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. మృతదేహినికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థికసాయం అందజేశారు. పాక్స్ డైరెక్టర్ మధుసూదన్ గౌడ్, నాయకులు బాల్‌రాజ్ గౌడ్, నాగిళ్ల వెంకటేష్, రామ్‌రెడ్డి తదితరులున్నారు.

కేశంపేట : కేశంపేట మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులను నేడు(శుక్రవారం) షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందిస్తారని తహసీల్దార్ అజాంఅలీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఇప్పటికే సమాచారం అందించామని, అందరూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఉదయం 9గంటలకు చేరుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా చెక్కుల అందిస్తామని తెలిపారు.

కడ్తాల్: ముక్తమాదారంలో వన మహోత్సవాన్ని జరుపుకున్నారు. వ్యవసాయ క్షేత్రాలు, చెట్లకింద సామూహిక భోజనాలు చేశారు. మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, జంగయ్య, పార్వతమ్మ, పద్మమ్మ, మంజుల, సంతోష, హారిక, రమేశ్, లావణ్య, చరణ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన దీక్షలు 142వ రోజుకు చేరాయి.

క్రైం కార్నర్

కలుషిత గడ్డిమేసి రెండు ఆవులు మృత్యువాత

కేశంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వేములనర్వకు చెందిన వడ్డె నర్సమ్మకు చెందిన రెండు ఆవులు కలుషిత గడ్డి మేసి చనిపోయాయి. మహిళా రైతు రూ.2లక్షలకు రెండు ఆవులు కొంది. వాటి మేత కోసం లూసన్ గడ్డిని పెంచింది. ఆవులను మేతకోసం తరచూ మడుల్లో వదులుతున్నారు. అయితే వీరి భూమి పక్కనే క్వార్జ్, కంకర క్రషర్ మిషన్లు ఉన్నాయి. బ్లాస్టింగ్‌ల సమయాల్లో భారీగా దుమ్ము, కంకర పొడి లేచి పొలాల్లో పడుతోంది. ఈ నేపథ్యంలో నర్సమ్మకు పొలంలో వేసిన గడ్డి పైనా దుమ్ము కప్పేసింది. ఈ గడ్డి మేసిన పాడి రెండు ఆవుల ఆరోగ్యం క్షీణించింది. గురువారం ఆవులు మృత్యువాత పడ్డాయని మహిళా రైతు విలపించింది. క్రషర్ యజమానులు ఆమెకు రూ.లక్ష పరిహారం ఇస్తామని చెప్పారని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తూర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి తిమ్మాపూర్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కొత్తూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడని చెప్పారు. మృతుడి వయసు 40ఏళ్లు ఉంటుందన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ వివాదంలో నలుగురి బైండోవర్

తలకొండపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో నలుగురిని పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. తలకొండపల్లికి చెందిన అనుపాటి యాదయ్య, అనుపాటి ఆంజనేయులు, అనుపాటి గణేష్, అనుపాటి పార్వతమ్మల మధ్య కొన్నేళ్లుగా పొలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఇరు వర్గాల మధ్య తరచూ గొడవలతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, గురువారం ఆ నలుగురినీ తహసీల్దార్ నాగార్జున వద్ద హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు. ఇప్పటి నుంచి ఏడాది సమయం వరకు వారు మళ్లీ ఏదైనా నేరం చేసినా.. గొడవపడినా అందుకు శిక్షగా డిపాజిట్ కింద రూ.5లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలని ఈ సందర్భంగా ఎస్సై చెప్పారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా?

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి

చౌదరిగూడ,మార్చి 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించమని అడిగితే అక్రమంగా అరెస్టులు చేస్తారా అని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కమ్మరి భూపాలచారి అన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ అసెంబ్లీ ముట్టడి పోరుబాటకు సిద్ధమవగా.. కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, భైరంపల్లి, రెగడి చిల్కమర్రి, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల మాజీ సర్పంచులను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసి 15 నెలలు గడిచినా బిల్లులను చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని రానున్న కాలంలో బీజేపీయే ప్రత్యామ్నాయ పార్టీ అని అన్నారు. అరెస్టయిన నర్సింహారెడ్డి, అంజనేయులు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అణచివేత ధోరణి మార్చుకోవాలి

కేశంపేట : ప్రభుత్వం అణచివేత ధోరణిని మార్చుకొని, మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కేశంపేట, కొత్తపేట, ఇప్పలపల్లి మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, కామ్లేకార్ నవీన్ కుమార్, తొట ఆంజనేయులు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌ల సంఘం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. కేశంపేట సీఐ నరహరి సూచనతో మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేసి స్టేషన్ తరలించారు.

చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి, నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న న్యాయవాదులు

చేవెళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించారు. సభ్యుల మధ్య హోరాహోరీగా పోరు జరిగింది. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఎం.నర్సింలు, జి.కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా కె.యాదగిరిగౌడ్, లైబ్రేరియన్‌గా పి.మల్లేశం, మహిళ రిప్రజెంటేటివ్‌గా జె.గీత వనజాక్షి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రవీందర్, ఈశ్వర్, ఎం.శివరాజ్‌గౌడ్, ఎం.ప్రదీప్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. బార్ అసోషియన్ నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జ్యోతి నర్సింహ

ఆమనగల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రూ. 3 లక్షలతో చేపట్టే పనులను మాజీ కౌన్సిలర్ గోరటి జ్యోతినర్సింహ గురువారం ప్రారంభించారు. రూ.2లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 5వ వార్డు ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శాంతమ్మ, రాహుఫ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు కౌన్సిలర్ చొరవ



భవానీనగర్ కాలనీలో మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

కొత్తూర్, మార్చి27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 6వ వార్డులోని భవానీ నగర్‌కాలనీలో విద్యుత్ సమస్య నెలకొనగా.. స్థానిక కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్ సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించి ఉదారత చాటుకున్నారు. కాలనీలో రెండు విద్యుత్ స్థంభాలు దగ్గర దగ్గరగా ఉండడంతో గాలులకు తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోతుండడంతో పలువురు ఇంటి యాజమానులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని, సొంత నిధులతో మరిన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానని తెలిపారు. కాలనీవాసులు కౌన్సిలర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.